ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ: 05.11.2025 సమయం: 18.10 గంటలు

ముఖ్యాంశాలు

1. గత పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ బీజేపీకి మద్దతు ఇచ్చిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విమర్శించారు.
2. ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతి హామీని కచ్చితంగా నెరవేర్చుతామని , ప్రతి పక్షాల మాటలు నమ్మి ఆందోళనకు గురి కావొద్దని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ప్రజలకు విజ్ఞప్తి చేశారు.
3. తెలంగాణ రైజింగ్ ను ఎవరు ఆపలేరని... 2047 నాటికి ప్రపంచంతో పోటీ పడేలా రాష్ట్రాన్ని తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు.
4. వచ్చే నెలలో నిర్వహించే రోడ్డు భద్రతా మాసంలో భాగంగా ప్రజలకు రహదారి భద్రతపై విస్తృత అవగాహన కల్పించాలని ఆర్టీఏ అధికారులకు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు.

ముఖ్యమంత్రి

బీఆర్ఎస్‌ను ఆ పార్టీ అధ్యక్షుడు చంద్రశేఖరరావు బీజేపీకి తాకట్టు పెట్టారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆరోపించారు. ఈ రోజు ముఖ్యమంత్రిని జూబ్లీహిల్స్ నియోజకవర్గ పరిధిలోని క్రైస్తవ సంఘాల ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిశారు. నవీన్ యాదవ్ గెలుపునకు తాము కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. గత పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ బీజేపీకి మద్దతు ఇచ్చిందని విమర్శించారు. పాస్టర్లు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి సానుకూలంగా స్పందించారు.

డెస్క్

జూబ్లీహిల్స్ ఉపఎన్నిక

జూబ్లీహిల్స్ ఉపఎన్నికల నేపథ్యంలో ప్రధాన పార్టీలన్నీ తమ ప్రచారాన్ని ముమ్మరం చేశాయి. కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌కు మద్ధతుగా బీసీ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ యూసఫ్ గూడ డివిజన్లో ఈ రోజు ప్రచారం చేశారు. సన్నబియ్యం లబ్దిదారుల ఇంట్లో భోజనం చేశారు. బీజేపీ అభ్యర్థి

లంకల ప్రదీప్ రెడ్డికి మద్దతుగా కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి ప్రచారం చేస్తున్నారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. జూబ్లీహిల్స్ నియోజకవర్గ ప్రజలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని విమర్శించారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల మధ్య అవగాహన ఒప్పందం కుదిరిందన్న ఆరోపణలను ఖండించారు. అలాగే బీఆర్ఎస్ హయాంలో చేసిన అభివృద్ధి కార్యక్రమాలపై అభివృద్ధి నివేదికను ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కల్వకుంట్ల తారకరామారావు విడుదల చేశారు.

డెస్క్

అజారుద్దీన్

జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపు ఖాయమని మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి అజారుద్దీన్ అన్నారు. హైదరాబాద్ గాంధీభవన్లో మంత్రి అజారుద్దీన్ మాట్లాడుతూ.. గత పదేళ్లలో జూబ్లీహిల్స్ నియోజకవర్గానికి బీఆర్ఎస్ పార్టీ చేసిందేమీ లేదని అన్నారు. బీజేపీ , బీఆర్ఎస్ కలసి పనిచేస్తున్నాయని ఆరోపించారు. బీఆర్ఎస్‌కు ఓటు వేస్తే బీజేపీకి ఓటు

వేసినట్లేనన్నారు. ఈ ఉపఎన్నికల్లో బీఆర్ఎస్ మూడో స్థానానికే పరిమితమవుతుందని విమర్శించారు.

బైట్: అజారుద్దీన్

డెస్క్

శ్రీధర్ బాబు

ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతి హామీని కచ్చితంగా నెరవేర్చుతామని , ప్రతి పక్షాల మాటలు నమ్మి ఆందోళనకు గురి కావొద్దని రాష్ట్ర ఐటీ , పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని కోరుతూ ప్రచారం నిర్వహించారు. రాష్ట్రంలో అన్ని వర్గాల సంక్షేమం కాంగ్రెస్ తోనే సాధ్యమన్నారు. తొమ్మిదేళ్ల పాలనలో నిరుద్యోగులను గాలికొదిలేసిన బీఆర్ఎస్ నేతలు ఈ ఉప ఎన్నికల్లో లబ్ది పొందేందుకు మొసలి కన్నీరు కారుస్తున్నారని ఆరోపించారు.

పీఎన్

ప్రైవేటు కళాశాలల బంద్

తమ డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించేవరకు బంద్ కొనసాగిస్తామని తెలంగాణ ప్రైవేట్ ఉన్నత విద్యాసంస్థల సమాఖ్య అధ్యక్షుడు రమేశ్‌బాబు అన్నారు. హైదరాబాద్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం ఉన్న ఫీజు బకాయిల్లో 50 శాతం చెల్లించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశామని ఆయన తెలిపారు. ఫీజు రీఎంబర్స్మెంట్ సమస్యల పరిష్కారానికి కమిటీ వేయడాన్ని స్వాగతిస్తున్నామని వెల్లడించారు. కాలేజీలపై విజిలెన్స్ దాడుల్లో నియంతృత్వ ధోరణి కనిపిస్తోందని విమర్శించారు. ఫీజు రీఎంబర్స్ మెంట్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ .. ప్రైవేటు కళాశాలలు నిరవధిక బంద్‌కు దిగిన విషయం తెలిసిందే.

డెస్క్

బండి సంజయ్

రాష్ట్రంలో 2 ,500కు పైగా విద్యా సంస్థలు ఒకేసారి మూత పడినప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించడం లేదని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ఆరోపించారు. 10 వేల 500 కోట్ల రూపాయల బకాయిల్లో

కనీసం సగం మొత్తాన్ని విడుదల చేయమని కాలేజీలు కోరుతున్నప్పటికీ, ప్రభుత్వం దానిని పరిష్కరించడం లేదని విమర్శించారు.

ఎక్స్

చేవెళ్ల రోడ్డు ప్రమాదం - పరిహారం

వికారాబాద్ జిల్లా చేవెళ్ల మండలం మీర్జాపూర్లో జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించిన తాండూరు వాసుల కుటుంబ సభ్యులకు ప్రభుత్వం ప్రకటించిన పరిహారాన్ని స్థానిక ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి అందించారు. తాండూరు నియోజకవర్గానికి చెందిన 13 మంది మృతుల కుటుంబ సభ్యులకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున రూ. 5లక్షలు , ఆర్టీసీ సంస్థ తరఫున రూ. 2 లక్షలు మొత్తం రూ. 7లక్షల చొప్పున చెక్కులు అందజేశారు. చెక్కుల పంపిణీ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ సుధీర్ కుమార్ , తాండూర్ సబ్ కలెక్టర్ ఉమాశంకర్ పాల్గొన్నారు.

పీటీసీ, వికారాబాద్

సోలార్ మోడల్ గ్రామం

రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట ను మోడల్ సోలార్ గ్రామంగా ఎంపిక చేసినట్లు తెలంగాణ ఇంధన వనరుల అభివృద్ధి సంస్థ ఉమ్మడి కరీంనగర్ జిల్లా మేనేజర్ మునీందర్ రెడ్డి తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి సూర్య ఘర్ ముఫ్త్ బిజిలి యోజనలో భాగంగా ఈ గ్రామాన్ని ఎంపిక చేసినట్లు వెల్లడించారు.

సౌండ్ బైట్: మునీందర్ రెడ్డి, ఉమ్మడి కరీంనగర్ జిల్లా మేనేజర్

రాజన్న సిరిసిల్ల

భట్టి

తెలంగాణ రైజింగ్ ను ఎవరు ఆపలేరని... 2047 నాటికి ప్రపంచంతో పోటీ పడేలా రాష్ట్రాన్ని తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు. వికారాబాద్ జిల్లా పరిగిలో ఈ రోజు పర్యటించిన భట్టి .. నజీరాబాద్ వద్ద 440 కెవి సబ్ స్టేషన్ నిర్మాణానికి శంఖుస్థాపన చేశారు. రైతులకు 8 కోట్ల విలువైన వ్యవసాయ విద్యుత్ ట్రాన్స్ఫార్మర్లు పంపిణీ చేశారు. డబుల్ బెడ్రూం ఇళ్ళు

కడతామని హామీ ఇచ్చిన గత బీఆరెస్ ప్రభుత్వం ఒక్క ఇళ్ళు కూడా నిర్మించలేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ప్రతి నియోజకవర్గంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం జరుగుతుందన్నారు.

పీటీసీ వికారాబాద్

పొన్నం ప్రభాకర్

వచ్చే నెలలో నిర్వహించే రోడ్డు భద్రతా మాసంలో భాగంగా ప్రజలకు రహదారి భద్రతపై విస్తృత అవగాహన కల్పించాలని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆర్టీఏ అధికారులకు సూచించారు. యూనిసెఫ్ ఆధ్వర్యంలో ఈ రోజు హైదరాబాద్లో రోడ్డు భద్రతపై - తీసుకోవాల్సిన చర్యలు , అవగాహన కల్పించాల్సిన అంశాలపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం మాట్లాడుతూ... రోడ్డు ప్రమాదాలు , మరణాలు సంభవించకుండా తగిన జాగ్రత్తలు తీసుకునేలా గ్రామాల్లో అవగాహన ర్యాలీలు నిర్వహించి కరపత్రాలు పంచాలని సూచించారు. అలాగే రోడ్డు భద్రతపై విద్యా సంస్థల్లో వ్యాస రచన పోటీలు నిర్వహించాలన్నారు. యూనిసెఫ్ ప్రతినిధి డాక్టర్ శ్రీధర్ మాట్లాడుతూ ... గ్లోబల్ బర్డెన్ ఆఫ్ డిసీస్ రిపోర్ట్ ప్రకారం 10-19 సంవత్సరాల వయస్కు ల మరణాలకు రోడ్డు ప్రమాదాలే ప్రధాన కారణమని తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమంలో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల నుండి రీజనల్ ట్రాన్స్ పోర్ట్ అథారిటీ నాన్ అఫీషియల్ మెంబర్లు పాల్గొన్నారు.

డెస్క్

కార్తీక పౌర్ణమి

కార్తీక పౌర్ణమి పర్వదినాన్ని రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా జరుపుకొంటున్నారు. రాష్ట్రంలోని ప్రధాన శైవ, వైష్ణవ క్షేత్రాలన్నీ భక్తులతో కిటకిటలాడుతున్నాయి. యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో కార్తీక పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు చేస్తున్నారు . ఆలయంలో ఏర్పాటు చేసిన సత్యనారాయణ స్వామి వ్రత మండపంను దేవస్థాన ఇంచార్జ్ కార్యనిర్వహణ అధికారి రవి పరిశీలించారు. భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామిని భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. నల్గొండ జిల్లా దామరచర్ల మండలంలో కృష్ణా-మూసి సంగమంలో తెలుగు రాష్ట్రాలకు చెందిన భక్తులు పుణ్య స్నానాలు ఆచరించి శ్రీ మీనాక్షి అగస్త్యేశ్వర స్వామి వారిని దర్శించుకున్నారు. కార్తీక పౌర్ణమి సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి , కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు.

పీటీసీ, యాదాద్రి, నల్లగొండ, పీటీసీ, యాదాద్రి, నల్లగొండ, భద్రాద్రి కొత్తగూడెం

గురునానక్ జయంతి

సిక్కుల ఆరాధ్య దైవం , ఆది గురువు గురునానక్ 556వ జయంతిని జరుపుకొంటున్నారు. గురునానక్ జయంతిని పుర పురస్కరించుకొని నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో విశాల్ కీర్తన్ దర్బార్ నిర్వహిస్తున్నారు.. రాజన్న సిరిసిల్ల జిల్లాలో గురునానక్ జయంతిని సిక్కులు ఘనంగా జరుపుకున్నారు. గురు నానక్ చిత్రపటాన్ని పూలతో అలంకరించి భక్తిశ్రద్ధలతో పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

డెస్క్, రాజన్న సిరిసిల్ల